క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామిని దర్శించిన ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్



స్వామివారిని దర్శించుకున్న ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పెదపూడి: సార్వత్రిక ఎన్నికల్లో విజయం చేకూరాలని, భారీ మెజార్టీ సాధించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాసు ఆదివారం పుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. పుట్టకొండ గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక సర్పంచ్ వల్లు వెంకటరమణ, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

61 పోలింగ్ స్టేషన్లు సిద్ధం

సీతానగరం: ఎన్నికల నేపథ్యంలో మండలంలో 61 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేసినట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ నెల్సన్ పాల్ బాబు ఆదివారం తెలిపారు. మండలంలో 59,036 ఓటర్లుండగా, వీరిలో పురుషులు 29,107, మహిళలు 29,928 మంది, ఇతరులు ఒకరు ఉన్నారని వివరించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తాగునీరు, టెంట్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్లలో 61 మంది పీవోలు, ఏఈపీవోలు 61 మంది, ఓపీవోలు ఒకొక్క పోలింగ్ స్టేషన్‌లో నలుగురు వంతున ఉంటారని చెప్పారు. వీరితో పాటు వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారని తెలిపారు. మండలంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. మొత్తం 66 మంది ఆంధ్రా పోలీసులు, 44 మంది కేంద్ర బలగాల వారు ఉన్నారన్నారు. డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్సైలు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారన్నారు. సమస్యాత్మక గ్రామాలుగా ముగ్గళ్ల, మునికూడలి, కాటరం, ఉండేశ్వరపురం ఉన్నాయని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని, స్లిప్‌లు పంచడం వంటివి చేయరాదని చెప్పారు. సెక్షన్–144 అమలులో ఉన్నందున గుంపులుగా ఉండరాదన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకువెళ్లరాదన్నారు.

ఘనంగా క్రీస్తు మోక్షారోహణ పండగ

మధురపూడి: కోరుకొండ ఎస్సార్‌నగర్ ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం క్రీస్తు మోక్షారోహణ పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్యసందేశమిచ్చారు. పునరుత్థానం తర్వాత పుడమిపై నడియాడిన క్రీస్తు ప్రభువు ఆదివారం మోక్షారోహణమయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు రూ.1.05 లక్షల ఆదాయం

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రానికి తిమ్మరాజుపాలెంకు చెందిన బండి సూర్యచంద్రప్రకాష్ 150 లీటర్ల పెరుగు అందజేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం , పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,04,787 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



గొన్నూరి సిద్ధూ (ఫైల్)

నల్లజర్ల: స్థానిక ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుణ్ణంపల్లి సిద్ధూ అనే మూడేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతడి పిన తండ్రి తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లికి చెందిన గొన్నూరి రాజు, మరియమ్మల కుమారుడైన సిద్ధూ ఆదివారం దూబచర్లలో బంధువుల ఇంట జరిగిన శుభ కార్యానికి కుటుంబ సభ్యులు అందరితో కలసి వచ్చాడు. సిద్ధూ చిన్నాన్న సూర్యచంద్రరావు తన బైక్‌పై సిద్ధూను ఎక్కించుకొని నల్లజర్ల బస్టాండ్‌లో ఉన్న తమ బంధువులను కలుసుకునేందుకు బయలు దేరాడు. నల్లజర్ల ప్రియాంక కన్వెన్షన్ సమీపంలో ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వారి బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. కిందపడిన సిద్ధూపై నుంచి బస్సు వెళ్లడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సూర్య చంద్రరావును తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నల్లజర్ల ఎస్‌ఐ వెంకట సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లతో మహిళ అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం గ్రామంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న పద్మ అనే మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం ఆదివారం తెలిపారు. ఆమె వద్ద 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై ఆర్.దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాలెట్ యూనిట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది



మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో బయలుదేరుతున్న సిబ్బంది



రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణికి సూచనలిస్తున్న పరిశీలకుడు బాలసుబ్రహ్మణ్యం

నేడే సార్వత్రిక సమరం

- మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది పయనం
- రాజానగరంలో 216 కేంద్రాలు
- మొత్తం 1,364 మంది సిబ్బంది
- పోలింగ్ సమయం : ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు

రాజానగరం: ప్రజాస్వామ్యంలో కీలకమైన సార్వత్రిక ఎన్నికలను సోమవారం ప్రశాంతంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఆర్వో ఎ. చైత్రవర్షిణి పర్యవేక్షణలో సంబంధిత అధికారులు పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో మొత్తం 2,16,491 ఓటర్లుండగా, వీరిలో పురుషులు 1,06,879, మహిళలు 1,09,606, ఆరుగురు థర్డ్ జెండర్లు ఉన్నారు. వీరంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా 216 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే పోలింగ్‌లో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించేందుకు 460 మందిని పీఓ, ఏపీఓలుగా, 904 మందిని ఓపీఓలుగా నియమించారు. వీరికి ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్నికల నిర్వహణలో మార్గదర్శకాలను మరోసారి గుర్తు చేసి, ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ సామగ్రిని అందజేశారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఒక్కో పోలింగ్ కేంద్రానికి రెండు ఈవీఎం యూనిట్లను, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల బ్యాలెట్ పత్రాలతో సహా అందజేశారు. ఆ పత్రాల క్రమ సంఖ్య, ముద్రణలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతనే సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేశారు. ఇందుకుగాను ఏర్పాటుచేసిన 56 బస్సుల్లో సిబ్బందిని మార్నింగ్ ఫెషప్ అయ్యేందుకు అవసరమైన టూల్‌కిట్స్‌తో సురక్షితంగా తరలించారు. పోలింగ్ పూర్తయ్యాక అవే బస్సుల్లో వారికిచ్చిన ఈవీఎం యూనిట్లతో తిరిగి నన్నయ యూనివర్సిటీకి చేరుకుని, స్ట్రాంగ్ రూమ్‌ల్లో వాటిని భద్రపర్చేందుకు ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో అప్పగించాల్సి ఉంటుంది. అప్పటివరకు ఈవీఎం యూనిట్ల భద్రత పీఓ, ఓపీఓలదే.



ఎన్నికల విధుల్లో నిమగ్నమైన పోలింగ్ సిబ్బంది

అంతటా సెక్షన్–144 అమలు

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సెక్షన్–144 అమలులో ఉంటుంది. నియోజకవర్గంలో మండలాల వారీగా సీతానగరంలో 59,235 మంది, కోరుకొండలో 65,439, రాజానగరంలో 91,817 మంది ఉన్న ఓటర్లకు సౌకర్యంగా ఉండేవిధంగా రెండు మోడల్ పోలింగ్ కేంద్రాలతో పాటు, 216 పీఎస్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన 50 గ్రామాలతో పాటు, ఇతర గ్రామాల్లోనూ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. నియోజకవర్గాన్ని 20 రూట్లుగా విభజించి, మైక్రో అబ్జర్వర్లతో పాటు, 40 మందిని సెక్టోరల్, రూట్ ఆఫీసర్లుగా నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సిస్టమ్‌ని ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లు, వ్యయ పరిశీలకులు, వీడియో బృందాలు కూడా పనిచేస్తాయి.

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన రాజానగరం నియోజకవర్గ పరిధిలోని 216 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.బాలసుబ్రహ్మణ్యం పరిశీలించారు. ప్రక్రియను పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి ఎ.చైత్యవర్షిణికి సూచనలిచ్చారు. భోజనాల అనంతరం పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్‌తో బస్సుల్లో పయనమయ్యారు.

అసెంబ్లీ స్థానానికి 12 మంది పోటీ

రాజానగరం అసెంబ్లీ స్థానానికి 12 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధాన పోటీ మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా, జనసేన పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మధ్య ముఖాముఖి ఉంటుంది. ఉభయులూ హోరాహోరీగా ప్రచారాలు పూర్తి చేశారు. అలాగే రాజమహేంద్రవరం ఎంపీ స్థానానికి కూడా ముఖాముఖి పోటీయే ఉంది. ఇక్కడ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీజేపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరి తలపడుతున్నారు.



అనపర్తి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, సామగ్రితో తరలివెళుతున్న ఉద్యోగులు

ఓటర్ల పండగ

- నియోజవకర్గంలో నేటి పోలింగ్‌కు సర్వ సిద్ధం
- ఉదయం 7 గంటలకు నుంచి ప్రారంభం
- సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్‌కు అనుసంధానం

అనపర్తి: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు తమ తీర్పును ఇచ్చే సమయం ఆసన్నమైంది. సోమవారం ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నిర్వహించే మాక్ పోలింగ్ అనంతరం ఉదయం 7 గంటల నుం- సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పరిధిలో మొత్తం 228 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని పోలింగ్ సిబ్బందికి అందించేందుకు గాను అనపర్తిలోని శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది పోలింగ్ యంత్రాలు, పోలింగ్ సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు.

సిబ్బందికి యంత్రాల కేటాయింపు

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించేందుకు గాను సుమారు 1600 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు అధికారుల చొప్పున పోలింగ్ విధులు నిర్వర్తించనున్నారు. అదేవిధంగా సుమారు 200 పైగా సిబ్బందిని రిజర్వులో ఉంచారు. ఇదిలా ఉండగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాలల పరిధిలోని 228 పోలింగ్ కేంద్రాల ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు పంపిణీ చేశారు. ర్యాండమైజేషన్ అనంతరం మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి 456 పోలింగ్ యంత్రాలను పంపిణీ చేశారు.

మీట నొక్కుడే..

బిక్కవోలు: ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. రెండు నెలలుగా ఎన్నికల సన్నాహాల్లో ఉన్న యంత్రాంగం పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం మీడ మీటర్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎం మీటనొక్కడమే తరువాయి అన్నట్లు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట పరిధిలో 58 గ్రామాల్లో 228 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2,26,053 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు. ఉదయం 5.30 నుంచి 7 గంటల వరకు మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకూ ఓటింగ్ జరుగుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరా పర్యవేక్షణలో పాటు వెబ్ క్యాస్టింగ్ ద్వారా కలెక్టరేట్‌కు అనుసంధానం చేశారు. దీనిలో భాగంగా అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాలు వద్ద సిబ్బంది ఏర్పాటు పూర్తి చేశారు. ఎలాంటి సంఘటన జరుగుకుండా పోలీసు బందోబస్తు చేశారు.



పందలపాకలోని ఓ పోలింగ్ కేంద్రం ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది, సామగ్రి

పెదపూడి: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారని, మండలంలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు, సామగ్రి చేరుకున్నాయని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ మండలంలో మొత్తం 64 పోలింగ్ బూత్‌ల ఉన్నాయన్నారు. మండలంలో 60,301 ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ బూత్‌ల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఆరుగురు అధికారులు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. మండలంలో మొత్తం 384 మంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటారన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.



పెదపూడిలోని జీఎంహెచ్ పాఠశాలలో పోలింగ్ బూత్‌కు చేరుకున్న సిబ్బంది



అనపర్తి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చిన పోలింగ్ సిబ్బంది

విధుల్లో ఎలాంటి పొరపాటుకూ తావివ్వొద్దు



అనపర్తి పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్



పోలింగ్ విధుల్లో పాల్గొనేందుకు అనపర్తి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు హాజరైన పోలీస్, భద్రతా సిబ్బంది

- కలెక్టర్ మాధవీలత
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి

అనపర్తి: ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివొద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.మాధవీలత సిబ్బందికి సూచించారు. నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ పరిశీలించించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజల బాధ్యతని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ జరిగే సమయం అత్యంత కీలకమని, ఎన్నికలకు సంబంధించిన ప్రతీ అంశంపై ఎన్నికల సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఎవ్వరికి ఏ విధమైన ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నట్టు ఆమె చెప్పారు. అనంతరం అనపర్తి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో తీసుకున్న చర్యలపై నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించిన కలెక్టర్ అందుబాటులో ఉంచిన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులపై మెడికల్ సిబ్బందిని ఆరా తీశారు.



పోలింగ్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ ఎస్పీ సిబ్బందితో సమావేశమై పోలీసు బలగాలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛకు భంగం కలుగకుండా, ప్రలోభాలకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ సమయంలో సిబ్బంది పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రత మరింత కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు గుమికూడ వద్దని సూచించారు. అనపర్తి సీఐ పి.శివగణేష్, ఎస్సై రామారావు, అడిషనల్ ఎస్పీ వెంట పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ పి.జగదీష్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఎన్నికల పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా చర్యలను ఎస్పీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. రౌడీ షీటర్లు, ఓల్డ్ ఎలక్షన్ అఫెండర్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలన్నారు. ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా వారికి సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఎవరు ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని, సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశామన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

ఓటు వేయకపోతే బాధ్యతారాహిత్యమే..

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పోలింగ్ రోజు కచ్చితంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పలువురు వృద్ధులు, వికలాంగులు అంటున్నారు. ఓటు వేయకుండా, సెలవు రోజు ఎంజాయ్ చేద్దామని యువత ఇంట్లో కూర్చుంటే అంతకంటే పెద్ద ప్రమాదం మరొకటి ఉండదని చెబుతున్నారు. మేము సైతం ఓటు వినియోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, యువతరం కూడా ఓటు వేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిస్తున్నారు.

సామాజిక బాధ్యత



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్క ఓటరు కచ్చితంగా వినియోగించుకోవాలి. అది మన సామాజిక బాధ్యత. మే 13న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఓటు హక్కును వినియోగించుకుంటాం. మరింత మందికి స్ఫూర్తి కల్పిస్తాం.

– నారాయణ వీరరాఘవయ్య, దివ్యాంగ ఓటరు

రాజ్యాంగం కల్పించిన ఆయుధం



ప్రతి ఒక్క ఓటరు రాజ్యాంగం ఆయుధంగా కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలి. యువత ఓటు హక్కు విలువను తెలుసుకోవాలి. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఓటు వేయడం మానలేదు. పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఓటు వేసి యువతకు ఆదర్శంగా నిలుస్తాం.

– పండింటి లక్ష్మీనారాయణ, సీనియర్ సిటిజన్